843) అఠాణ

ప|| అదిగో కొలువై వున్నాడు అలమేలు మంగపతి | పదివేల విధములను పొరు పట్టము చేయుచు ||

చ|| రంగ మండపములో రత్న సింహాసనముపై | అంగనామణులతొ అమరవేంచేసి |
బంగారు పావడలు పసరించి యిరుగడల | శృంగారముగ సురలు సేవ సేయగను ||

చ|| వెండిపైడి గుదియలను వేత్రహస్తులు పొగడ | నిండు వెన్నెల పూల దండలు అమర |
గుండిగలు కానుకలను పొనర లెక్కలు చేయ | దండిమీరగ నిపుడు దేవరాయడు చెలగి ||

చ|| అంగ రంగ వైభవముల రంగుగా చేకొనుచు | మంగళ హారతుల మహిమ వెలసీ |
శృంగారమైనట్టిమా శ్రీవేంకటాధిపుడు | అంగనలు కొలువగాను యిపుడు వేంచేసి ||